సాక్షి వరంగల్

శనివారం | 4 | నవంబర్ | 2023



నేడు మేడిగడ్డకు బీజేపీ టీం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీని నేడు (శనివారం) బీజేపీ నాయకులు పరిశీలించనున్నారు. - IIలో▸



ఎన్నికల్లో భూనిర్వాసిత రైతుల పోటీ - IIలో▸

పరకాల సబ్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ భూనిర్వాసిత రైతులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధమయ్యారు.

గరిష్టం/కనిష్టం $33^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో రాంచరణ్ ప్రతిభ



వర్ధన్నపేట : రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న చాగంటి రాంచరణ్ ప్రతిభ కనబరిచాడని హెచ్‌ఎం ఎ.వేణు తెలిపారు. ఈనెల 1, 2 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14 బాలబాలికల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో రాంచరణ్‌ను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు ఉషారాణి, ఎ.రాజు, లింగమూర్తి, విజయ్, శ్రీదేవి, ఎం.రాజు, అరుణాదేవి, బి.వీరస్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఎండీ జావెద్ అభినందించారు.

పింఛన్ కాజేసిన కార్యదర్శికి మెమో

నెక్కొండ : వృద్ధురాలి పింఛన్ కాజేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఉన్నతాధికారులు శుక్రవారం మెమో జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పింఛన్ రావడం లేదని మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన చాగంటి యాకలక్ష్మి.. పంచాయతీ కార్యదర్శి రాకేష్‌పై ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ కార్యదర్శికి మెమో జారీ చేశారు. ఫిబ్రవరిలో పింఛన్ మంజూరు కాగా.. ప్రతి నెల పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నెలనెలా పింఛన్ తీసుకున్నట్లు యాప్‌లో నమోదైందని, వేలి ముద్రను వినియోగించి పింఛన్ కాజేశారా, ఎవరికి చెల్లించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని విధుల్లో నిర్లక్ష్యం, సీసీఏ రూల్స్ ప్రకారం సదరు కార్యదర్శికి మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

రేపు బేస్‌బాల్ జిల్లా జట్టు ఎంపికలు

గీసుకొండ : వరంగల్ సుందరయ్యనగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో ఆదివారం వరంగల్ జిల్లాస్థాయి బేస్ బాల్ సీనియర్ (పురుషులు, స్త్రీ) జట్లకు ఎంపికలు నిర్వహించనున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నవీన్, భీమగాని ముఖర్జీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11, 12 తేదీల్లో నిర్మల్‌లో జరిగే సీనియర్స్ బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9848483431, 8978910210 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి



అఫ్రీన(ఫైల్)

ఖానాపురం : చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన అఫ్రీన (17) నర్సంపేటలోని మైనార్టీ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సెలవులపై ఇటీవల ఇంటికి వచ్చింది. కళాశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించగా ఆ కళాశాలకు వెళ్లడం ఇష్టంలేదని, మరో కళాశాలలో చేర్పించాలని కోరింది. ఆర్థిక పరిస్థితి బాగా లేదని, అందులోనే చదువుకోవాలని తల్లిదండ్రులు సూచించి పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో గత నెల 31న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

నామినేషన్లు షురూ

వరంగల్ తూర్పు, నర్సంపేటలో దాఖలు

- మొదటి రోజు వర్ధన్నపేటలో నిల్
- అభ్యర్థుల కోసం హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు
- కేంద్రాల్లో బారికేడ్లు, సీసీ కెమెరాలు
- పోలీసుల భారీ బందోబస్తు





నర్సంపేట : నామినేషన్ దాఖలు చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి ఇమ్మడి చిన్నికృష్ణ, ఎంసీపీఐ (యూ) అభ్యర్థి పెద్దారపు రమేష్





వరంగల్ అర్బన్ : నామినేషన్ దాఖలు చేస్తున్న రాజనాల శ్రీహరి, బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్ అర్బన్/నర్సంపేట : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం శుక్రవారం ప్రారంభమైంది. ఇందుకోసం వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్‌రిజ్వాన్ బాషాకు సమర్పించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా, స్వతంత్ర అభ్యర్థిగా రెండు వేర్వేరు నామినేషన్ పత్రాలను బీఆర్‌ఎస్ నాయకుడు, శాప్ మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి ఆర్‌ఓకు అందజేశారు. నర్సంపేటలో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎంసీపీఐ(యూ) అభ్యర్థి పెద్దారపు రమేష్, ఇండిపెండెంట్ అభ్యర్థి ఇమ్మడి చిన్నికృష్ణ నామినేషన్లు అందజేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణవేణి తెలిపారు. కాగా, మొదటి రోజు వర్ధన్నపేటలో అభ్యర్థులు ఎవరు నామినేషన్లు వేయలేదని అధికారులు పేర్కొన్నారు. పరకాల అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థి గజ్జి విష్ణు రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కాగా, గజ్జి విష్ణు స్థానిక ఎమ్మెల్యేపై తిరుగుబాటు చేసి బీఆర్‌ఎస్ నుంచి బహిష్కృత నాయకుడు కావడం విశేషం.

ఐదుగురికి మాత్రమే అనుమతి..

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సమస్యల పరిష్కారం కోసం రిటర్నింగ్ అధికారులు హెల్ప్‌డెస్కలను ఏర్పాటు చేశారు. నామినేషన్ పత్రాలను హెల్ప్‌డెస్క్‌లో పరిశీలించుకుంటే ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోవచ్చు. నామినేషన్ దాఖలుకు అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తున్నారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల వరకు బారికేడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల నుంచి 3 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని అధికారులు తెలిపారు.

బల్దియాలో పౌర సేవలకు అంతరాయం

తూర్పు నియోజకవర్గానికి నామినేషన్లు స్వీకరించడంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పౌర సేవలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరిని అనుమతించలేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర నిరాశ చెందారు. నామినేషన్ల సందర్భంగా కార్యాలయ వేళలు అధికారులు ప్రకటించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది మహిళలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వెనుదిరిగి పోయారు.

జంగ్ తెలంగాణ

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- దొంతి, రేవూరి ఒక్కటైనా ప్రజలంతా నా వెంటే
- నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట : పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

నర్సంపేట/దుగ్గొండి : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం, నర్సంపేట మండలం నాగుర్లపల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి మండలం గోపాలపురం, గొల్లపల్లి, నారాయణతండా, రేకంపల్లి, నాచినపల్లి, లక్ష్మీపురం, నెక్కొండ మండలం టీకే తండా, నల్లబెల్లి మండలం మేడపల్లికి చెందిన పలు పార్టీల నాయకులు పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కేశవాపురంలో మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి బంధువులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఒక్కటైనా ప్రజలంతా తనవైపే ఉన్నారని తెలిపారు. పేదింటి బిడ్డను ఓడించడానికి ఆర్థికంగా బలవంతులైన ఇద్దరు ఒప్పందం కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికలోనూ రేవూరి, దొంతి ఒక్కటవుతూనే ఉన్నారన్నారు. నర్సంపేట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి వి.ప్రకాశ్, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, నాయకులు సుకినె రాజేశ్వర్‌రావు, తోకల నర్సింహారెడ్డి, మహిపాల్ రెడ్డి, పాండవుల సురేష్ పాల్గొన్నారు. అదేవిధంగా ద్వారకపేటలో రైతులు, ముఖ్యనాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి, నర్సంపేట మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, రాయిడి దుశ్యంత్‌రెడ్డి, కౌన్సిలర్లు రామసహాయం శ్రీదేవి, మినుముల రాజు, పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

- ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్



వర్ధన్నపేట ఆర్‌ఓ కార్యాలయం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న డీసీపీ రవీందర్

వర్ధన్నపేట : రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నియమావళిని పాటించాలని ఈస్ట్ జోన్ డీసీపీ, జిల్లా నోడల్ అధికారి పులిగిల్ల రవీందర్ సూచించారు. వర్ధన్నపేట ఆర్‌ఓ కార్యాలయాన్ని శుక్రవారం మామునూరు ఏసీపీ సతీష్‌కుమార్, పర్వతగిరి, మామునూరు సీఐలు శ్రీనివాస్, క్రాంతికుమార్, వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.

వలస కొంగలతో జాగ్రత్త..!

- బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి



నందనాయక్ తండాలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

గీసుకొండ : పరకాల నియోజకవర్గానికి వలస కొంగలు వస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండండి.. నర్సంపేటలో ఓడి ముఖం చాటేసిన వారు ఇక్కడికి పోటీ వస్తున్నారు.. 'కొండ'లనే పిండి చేసిన చరిత్ర మనది అని బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని సూర్యతండా, కొమ్మాల, విశ్వనాథపురం, నందనాయక్‌తండా, దస్రుతండాలో శుక్రవారం రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా చేసి మౌలిక వసతులు కల్పించిన ఘనత తనదేనని అన్నారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మితే ఆగమైతామని, ఈసారి తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు మంగళహారతులు, కోలాటాలతో ఆయనకు స్వాగతం పలికారు. జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరగోని రాజ్‌కుమార్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు సిరిశె శ్రీకాంత్, రణంభరత్, దళిత బంధు మండల కన్వీనర్ కోట ప్రమోద్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ లెనిన్, సర్పంచ్‌లు బొడకుంట్ల ప్రకాష్, అంకతి నాగేశ్వర్‌రావు, వీరాటి రజిత పాల్గొన్నారు.

వంజరపల్లి, కృష్ణానగర్‌లో ప్రచారం..

సంగెం : మండలంలోని వంజరపల్లి, కృష్ణానగర్, చింతపల్లి గ్రామాల్లో చల్లా ధర్మారెడ్డి ప్రచారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు స్రవంతి, మోహన్ పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చులను పక్కాగా లెక్కించాలి

- వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్



మాట్లాడుతున్న పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్

కరీమాబాద్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను వ్యయ పరిశీలన బృందాలు కచ్చితంగా లెక్కించాలని వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రావీణ్య, డీసీపీ రవీందర్, తూర్పు ఆర్‌ఓ రిజ్వాన్‌బాషా, వర్ధన్నపేట ఆర్‌ఓ అశ్వినితానాజీ, నర్సంపేట ఆర్‌ఓ కృష్ణవేణితోపాటు అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించేలా నోడల్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అభ్యర్థులు కూడా తమ ప్రచార వ్యయ ఖర్చుల అకౌంట్లు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. అనుమతి తీసుకున్న వాహనాల కంటే ఎక్కువ ఉపయోగిస్తే ఖర్చులు నమోదు చేసి అనుమతి రద్దు చేయాలని ఆదేశించారు. ఒకరు అనుమతి తీసుకున్న వాహనం వేరే అభ్యర్థి ఉపయోగించరాదని తేల్చి చెప్పారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించేటప్పుడు ప్రింటర్, ప్రచురణకర్తలు ఎన్నికల ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనలు పాటించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎన్నికల ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికెట్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేస్తుందని వివరించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కానుకలు, డబ్బు, మద్యం పంపిణీ నియంత్రణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎస్‌ఎస్‌టీలు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలు, రూ.10 లక్షల నగదు కంటే మించి జమ, ఉపసంహరణ, ఆన్‌లైన్ ద్వారా మల్టిపుల్ లావాదేవీలపై పర్యవేక్షణ ఉండాలన్నారు.

ఎన్నికల అధికారి ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో 9 చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9 ఎఫ్‌ఎస్‌టీ, 9 ఎస్‌ఎస్‌టీ, 8 వీఎస్‌టీ బృందాలు, 10 వీవీటీ బృందాలు నియోజకవర్గాల్లో తనిఖీలను ముమ్మరం చేసినట్లు వివరించారు. సమావేశంలో వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా నోడల్ అధికారులు సంజీవరెడ్డి, పుష్పలత, అయూబ్‌అలీ, జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మనాయక్, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, పర్యవేక్షకులు విశ్వనారాయణ, సదానందం, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంట్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుడిని కలిసిన కలెక్టర్

ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్ శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. నిట్ అతిథిగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ఈక్రమంలోనే ఎన్నికలలో వ్యయ లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కమిటీలు, బృందాలు, వాటి పనితీరును అమిత్ ప్రతాప్‌సింగ్‌కు వివరించారు. ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న, అప్పగించిన నగదు, మద్యం గురించి తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. 24 గంటలు పనిచేసే ఫిర్యాదుల కేంద్రం, విజిల్, కంట్రోల్ రూం 1950, సోషల్ మీడియా ఫిర్యాదుల నమోదును పరిశీలించారు. మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించుటకు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు జిల్లా ఫిర్యాదుల కేంద్రం కీలక పాత్ర వహిస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా, మీడియాలో ఫేక్ న్యూస్ ప్రసారమైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. యువత సీ–విజిల్ యాప్‌ను ఉపయోగించి ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ఉల్లంఘనలను తన దృష్టికి తీసుకురావాలని, 24 గంటలు కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం నుంచి సీ–విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ఇప్పటి వరకు సీ–విజిల్ యాప్ ద్వారా నమోదైన 38 ఫిర్యాదులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఆర్డీఓ వాసుచంద్ర, నోడల్ అధికారులు పుష్ప, భాగ్యలక్ష్మి, ఏఓ శ్రీకాంత్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పేరుపేరుకో చరిత్ర

- ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు
- నైసర్గిక స్వరూపం.. జనాభా ఆధారంగా నవీకరణ

ప్రత్యేక కార్పొరేషన్ కావాలి

- ఉపాధి లేకనే ఆటోరంగం వైపు మళ్లాం
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో ఆటోడ్రైవర్లు

- IIలో▸

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

- డీఈఓ వాసంతి



చెన్నారావుపేట : విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఈఓ వాసంతి

చెన్నారావుపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలికితీయాలని డీఈఓ వాసంతి ఉపాధ్యాయులకు సూచించారు. లింగాపురం, కోనాపురం గ్రామాల పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెను ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం తెలుసుకున్నారు. చాక్‌పీస్ పట్టుకుని విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారి ప్రతిభను తెలుసుకుని సంతృప్తి చెందారు. అలాగే, మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సీస్ పరీక్షను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ బైరి సరళ, మూనుపాటి పాపన్న, ప్రభాకర్‌రావు, హెచ్‌ఎంలు సలీం, కిశోర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

సర్వే పరీక్షలతో సత్ఫలితాలు

నెక్కొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే సర్వే పరీక్షలతో సత్ఫలితాలు వస్తాయని డీఈఓ వాసంతి అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన సీస్ పరీక్షలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రత్నమాల, మండల నోడల్ ఆఫీసర్ రవికుమార్, మండల ఎంఐఎస్ కార్తీక్, కంప్యూటర్ ఆపరేటర్ జ్యోతి, సీఆర్పీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల రికార్డుల పరిశీలన

దుగ్గొండి : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 6, 9 తరగతి విద్యార్థులకు శుక్రవారం సీస్–2023 పరీక్ష నిర్వహించారు. ఈమేరకు పరీక్ష రాసిన విద్యార్థుల రికార్డులను రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామస్వామి, వెంకటేశ్వర్లు, ఇన్విజిలేటర్లు తేజస్విని, నందిని పాల్గొన్నారు.

తప్పుడు రిపోర్టులిచ్చారు..



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు లాసాని రాములు. నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామం. ఇక్కడ క్యాంపు నిర్వహించి ఉచితంగా పరీక్షలు చేస్తున్నారంటే.. నమ్మి గత ఆగస్టు 27న రక్తం, మూత్రం శాంపిల్స్ ఇచ్చాడు. కొత్త టెక్నాలజీతో 50 రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలను రక్తం, మూత్రంతోనే చేస్తామని చెప్పారు. గుండె, చెవులు, కళ్లు, ఊపిరితిత్తులకు సంబంధించి పరీక్షలు చేయలేదు. కానీ.. చేసినట్లు రిపోర్టులిచ్చారు. కంటి చూపు సమస్యతో బాధపడుతున్నాడు. కానీ, అలాంటి సమస్యలేమీ లేవని రిపోర్టు అప్పగించారు. ప్రజలను నమ్మించి రోగనిర్ధారణ పరీక్షలు చేయకుండానే.. తప్పుడు నివేదికలు అందించిన తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రాములు అధికారులను కోరుతున్నాడు.

రిపోర్ట్సు నార్మల్!

- రోగనిర్ధారణ పరీక్షలు చేయకుండానే తప్పుడు నివేదికలు
- భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి నిర్వాకం
- నిలదీస్తున్న ప్రజలు.. సమాధానం దాటవేస్తున్న నిర్వాహకులు



పంపిణీకి సిద్ధంగా ఉన్న తప్పుడు నివేదికలు

నల్లబెల్లి : సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్ ఇన్సూరెన్స్ కార్డు కలిగి ఉన్న వారందరికీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి బాధ్యులు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. కార్డు కలిగిన వారికి ఉచితంగా సుమారు 50 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 1.20 లక్షల మంది కార్మికులకు పరీక్షలు చేశారు. ఈ పరీక్షలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయించుకుంటే సుమారు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందని గొప్పగా ప్రచారం చేసున్నారు. ఇందుకోసం కార్మికుల నుంచి రక్తం, మూత్రం సేకరిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వీటి ద్వారానే 50 రకాల పరీక్షలు చేసినట్లు నమ్మిస్తూ రిపోర్టులిస్తున్నారు. ఇదేంటని నిర్వాహకులను నిలదీస్తున్నారు. ఈవిషయాలు బయటికి పొక్కకుండా కార్మికులను నిర్వాహకులు బతిమిలాడుకుంటున్నారు. రక్తం, మూత్రం మాత్రమే సేకరించిన కార్మికులకు గుండె, చెవులు, ఊపిరితిత్తులు, కళ్ల పనితీరు మెరుగ్గా ఉన్నట్లు రిపోర్టులిస్తున్నారు. కంటి, చెవులు, గుండె వ్యాధులతో బాధపడుతున్నవారికి సైతం నార్మల్ రిపోర్టులు ఇస్తున్నారు. ఇదేంటని నిర్వాహకులను ప్రశ్నిస్తే సమాధానం దాటవేస్తున్నారు.



నారక్కపేటలో శాంపిల్ సేకరిస్తున్న సిబ్బంది

చర్యలు తీసుకుంటాం..



గ్రామాల్లో ప్రజల నుంచి రక్తం, మూత్రం శాంపిల్స్ సేకరించి తప్పుడు రిపోర్టులు ఇస్తే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. రక్తం, మూత్ర పరీక్షలు చేసి.. గుండెకు సంబంధించిన ఈసీజీ, కంటి చూపు, చెవుల వినికిడి, ఊపిరితిత్తుల సామర్థ్యం రిపోర్టులు ఇవ్వడం సరైంది కాదు. విచారణ చేసి తప్పుడు రిపోర్టులు ఇచ్చినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ

ఆస్పత్రికి షోకాజ్ నోటీస్ అందజేత



ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్‌కు షోకాజ్ నోటీసు అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ఓ నర్సింగ్ హోంలో గురువారం బాలింత మృతి చెందింది. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్ శుక్రవారం ఆస్పత్రిని సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలింత మృతికి కారణమైన విషయాలపై ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్‌కు షోకాజ్ నోటీసు అందించారు. నోటీస్ అందిన వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆస్పత్రిలో జరిగిన పరిణామాలపై ఉన్నత కమిటీతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రకాశ్ తెలిపారు. డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ



దేశం నుంచి భూస్వామ్య అవశేషాలను, కుల, మత, వర్గ భావనలను రూపుమాపాలంటే ఎన్నికలే శరణ్యం.
- టీఎన్ శేషన్

పేరు పేరుకో చరిత్ర

- ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు
- నైసర్గిక స్వరూపం.. జనాభా ఆధారంగా నవీకరణ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నియోజకవర్గాల పేర్లకు ఘన చరిత్ర ఉంది. 2009 పునర్విభజన తర్వాత 12 శాసనసభ నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. వాటికి ఆ పేరెలా వచ్చిందనేది చరిత్ర పరిశోధకులు, ఆయా ప్రాంతాల్లోని పెద్దల్ని అడగ్గా.. వారు అందించిన సమాచారం 'సాక్షి' ప్రత్యేకం.
– హన్మకొండ అర్బన్



భూపాలపల్లి

1889లో భుక్యా భూపాల్‌నాయక్, ఆయన సోదరుడు శివ నాయక్ మరికొంత మంది గిరిజనులు కలిసి ఓ భూస్వామి అనుమతితో ఆ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్నారు. కొన్నేళ్ల తర్వాత భూపాల్‌నాయక్ బంధువులు సైతం అక్కడికే వలస వచ్చారు. దీంతో ఆప్రాంతాన్ని అప్పట్లో భూపాల్‌నాయక్ గ్రామంగా పిలిచేవారు. కాలక్రమంలో ఆ ప్రాంతాన్ని భూపాలపల్లిగా పిలుస్తున్నారని చెబుతుంటారు.

ములుగు

పాత తాలూకా, రెవెన్యూ డివిజన్ కేంద్రం అయిన ములుగును గతంలో మొలుగు అని పిలిచేవారు. ఏజెన్సీ అటవీ ప్రాంతమైన ములుగులో దట్టమైన మొగిలి చెట్లు అన్ని వేళల్లో మబ్బును కప్పేసినట్లు కనిపించేవట. దీంతో ఈప్రాంతాన్ని మొగులుగా పిలిచేవారట. ఆతర్వాత.. ముల్గు.. ములుగుగా పేరు రూపాంతరం చెందుతూ వచ్చింది.




నర్సంపేట

గోల్కొండ ప్రభువు తానీష వద్ద అక్కన్న, మాదన్నలు ఉండేవారు. వారు ఈ ప్రాంతంలో మాదన్నపేట చెరువు నిర్మించారు. వారి వద్ద నర్సక్క అనే మహిళ సేవకురాలిగా పని చేసేది. నర్సక్క ద్వారాకాపేటకు సమీపంలో ఉండే చర్పకాస్ సమీపంలో నివసించేది. దీంతో ఆప్రాంతాన్ని నర్సక్కపేటగా పిలిచేవారు. కాలక్రమంలో అదే నర్సంపేటగా మారిందని చరిత్రకారులు చెబుతుంటారు.



పరకాల

ఒకప్పుడు కాలువ ప్రవహించే ప్రాంతంలో తర్వాత చిన్న గ్రామం ఏర్పడింది. క్రమేపీ విస్తరిస్తూ ఇది పరకాలగా పేరు మార్చుకుంది. 1920 ప్రాంతంలో సమీపంలో ఉన్న చలివాగు నుంచి ఈ పర్రె కాలువ ద్వారా నీరు ప్రవహించేది. ఆ కాలువ ఆధారంగా, కాలువపై ఆధారపడి అక్కడ గ్రామం ఏర్పడి.. పర్రె కాలువ కాస్తా పరకాలగా మారిందని పెద్దలు చెబుతుంటారు.





స్టేషన్‌ఘన్‌పూర్

కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు ఇతర రాజ్యాలపై దండయాత్ర చేసిన క్రమంలో అనేక మంది సైనికులు యుద్ధంలో మరణిస్తారు. లెక్కకు మిక్కిలి సైనికుల మరణంతో గణపతి దేవ చక్రవర్తి తీవ్ర మనోవేదనకు గురవుతాడు. సైనికుల చావుకు కారణమైనందున దానికి పాపపరిహారంగా 16 చెరువులు, 16 గ్రామాలు నిర్మించాలని పెద్దలు సూచిస్తారు. దీంతో గణపతి దేవుడు ఆ కార్యం పూర్తి చేశాడట. ఆక్రమంలోనే మొదట్లో ఘనపురం అనే పేరు ఈ ప్రాంతానికి వచ్చిందని చరిత్ర చెబుతోంది. తర్వాతి కాలంలో బ్రిటీష్ వారు ఇక్కడ రవాణా కోసం రైల్వే స్టేషన్ నిర్మించారు. దీంతో ఘనపురం రైల్వేస్టేషన్ అని మొదట్లో పిలిచేవారు. తర్వాతి క్రమంలో స్టేషన్ ఘన్‌పూర్‌గా మారిందని అంటారు.

జనగామ

ఒకప్పటి జైనుల గ్రామం పేరు.. క్రమంగా జనగామగా రూపాంతరం చెందింది. ప్రస్తుత నల్గొండ జిల్లాలోని సుప్రసిద్ధ మహావీర జైన దేవాలయం ఉన్న కొలనుపాకకు వివిధ ప్రాంతాల నుంచి జైన మతస్తులు ఇక్కడికి వచ్చేవారు. జనగామ రైల్వేస్టేషన్‌లో దిగి ఇక్కడి నుంచి ఎడ్ల బండ్ల ద్వారా పెద్దరాంచర్ల, పసరమడ్ల, పోచన్నపేట మీదుగా కొలనుపాక జైన దేవాలయం చేరుకునే వారు. అలా అక్కడ జైనుల సంచారం ఎక్కువగా ఉండడంతో జైన్‌గాం అని, జైన గ్రామం అని మొదట్లో పిలిచేవారు. కాలక్రమంలో ఆపేరు జనగామగా మారిందని చరిత్ర పరిశోధకులు చెబుతుంటారు.






పాలకుర్తి

తొలి తెలుగు విప్లవ కవిగా పాల్కురికి సోమనాథుడి ఇంటిపేరుతో కొంతకాలం పాలకుర్తిని పిలిచేవారు. తర్వాత పాల్కురికి.. పాలకుర్తిగా మారింది. క్రీస్తు శకం 1160 నుంచి 1240 వరకు సోమనాథుడు జీవించి ఉన్నాడు. ఆయన రచనలు చేసింది గ్రామంలోని కొండపైనే. అప్పటికే ఈ క్షేత్రం లక్ష్మీ నృసింహస్వామిది. కాగా.. స్వయంభూ అయిన శివుడి గుహలోనే కూర్చుని బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, ఇతర శతకాలు రచించారని చరిత్ర చెబుతోంది. అలా మహాకవి పాల్కుర్కి సోమనాథుడి ఇంటి పేరుతో నేటి పాలకుర్తి ఏర్పడింది.

వరంగల్

కాకతీయుల కాలం నుంచి వరంగల్ నగరాన్ని ఏకశిల.. ఓరుగల్లు నగరంగా పిలిచేవారు. ఓరుగల్లే కాలక్రమంలో వరంగల్‌గా మారిందని చెబుతుంటారు. అయితే ఈపరిణామ క్రమాన్ని ఓసారి పరిశీలిస్తే... ద్రవిడ భాషల్లో తెలుగు కూడా ఒకటి. తమిళంలో ఒరుగు అంటే ఒకటి అని అర్థం. కల్లు అంటే రాయి అని అర్థం. అంటే ఒకరాయి అనే అర్థంతో ఏకశిలా నగరాన్ని ఓరుగల్లు అని పిలిచేవారని చరిత్ర చెబుతోంది. ఓరుగల్లు పేరును నిజాం కాలంలో పలకడం ఇబ్బందిగా అనిపించి. వరంగల్‌గా మార్చారని చెబుతారు. గతంలో హనుమకొండ పేరుతో నియోజకవర్గం ఉన్నప్పటికీ చారిత్రక ఓరుగల్లు పేరుతోనే నియోజకవర్గాల పునర్విభజన సమయంలో వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలు ఏర్పాటయ్యాయి.






వర్ధన్నపేట

వర్ధన్నపేట ప్రాంతంలో కోనన్న, దమ్మన్న, వర్ధన్న, బయ్యన్న పేర్లతో అన్నదమ్ములు ఉండేవారట. వారంతా కొన్ని కిలోమీటర్ల దూరంలో ఒకొక్కరూ ఉండేవారు. అలా వారున్న ప్రాంతానికి వారి పేరుతో వర్ధన్నపేట, కోనాపురం, దమ్మన్నపేట, బయ్యన్నదేవుడి గుట్టలుగా పేర్లు ఏర్పడ్డాయని చెబుతుంటారు. ఆ అన్నదమ్ముల్లో ఒకరైన వర్ధన్నపేరుతో వర్ధన్నపేట ఏర్పాటైనట్లు చెబుతుంటారు.



మహబూబాబాద్

మహబూబాబాద్‌లో దట్టమైన అటవీ ప్రాంతం ఉండేది. పెద్ద వృక్షాలు(మానులు) ఉండేవి. అందువల్లనే ఈ ప్రాంతాన్ని మానుకోటగా పిలిచేవారు. ఈప్రాంతానికి మహబూబ్‌అలీఖాన్ అనే నిజాం రాజు వేటకు తరుచూ వస్తుండడంతో మానెకోట కాస్త మహబూబ్ ఆబాదీగా.. కాలక్రమంలో మహబూబాబాద్‌గా మారింది. 1952లో మహబూబాబాద్ శాసనసభ నియోజకవర్గం.. తర్వాత పార్లమెంట్ నియోజకవర్గం, రెవెన్యూ డివిజన్, జిల్లా కేంద్రంగా మహబూబాబాద్ అభివృద్ధి చెందింది. మొదట్లో జనరల్‌గా ఉన్న ఈ నియోజకవర్గం ప్రసుత్తం ఎస్టీ రిజర్వుడ్‌గా మారింది.



డోర్నకల్

డోర్నకల్ పేరుపై కూడా ఓ ప్రాచీన కథ ప్రచారంలో ఉంది. డోర్నకల్ మండల పరిధి అమ్మపాలెం నుంచి ప్రతీ ఏటా పౌర్ణమిరోజున ఖమ్మం జిల్లాలోని(ప్రస్తుతం మానుకోట జిల్లా) గార్ల మండలం ముర్రిగూడెం వేంకటేశ్వరస్వామి కల్యాణానికి అలివేలు మంగమ్మ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తుండడం సంప్రదాయం. దీంతో భక్తులు అప్పట్లో డోర్నకల్ మీదుగా అమ్మపాలెం, గార్ల గ్రామాలు కలుపుతూ.. తోరణాలు కట్టేవారట. దీంతో ఆ ప్రాంతమంతా శోభాయమానంగా కనిపించేంది. అప్పటి తోర్నాల కళే క్రమంగా స్థానికుల వాడకంలో తోర్నాల, తోర్నకల్, డోర్నకల్‌గా మారిందంటారు.



ఈ ముచ్చటెరికేనా?

రెండో ఈవీఎం ఎప్పుడు వినియోగిస్తారంటే..

కాజీపేట: బ్యాలెట్ బాక్సుల స్థానంలో ఈవీఎంలను వినియోగిస్తున్న విషయం తెలిసిందే. ఒక ఈవీఎంలో 64 మంది అభ్యర్థుల పేర్లను రికార్డు చేయవచ్చు. అంతకు మించి అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినప్పుడు రెండో ఈవీఎంను ఎన్నికల్లో వినియోగిస్తారు. ఒక ఈవీఎంలో 3,740 ఓట్లు మాత్రమే వేయడానికి అవకాశం ఉంటుంది. అయితే అంతకు మించి ఓట్లు ఒకే దగ్గర పోలయ్యే అవకాశం ఉండదు.

మా ఓట్లు అమ్మకానికి లేవు



చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన యువ ఓటరు కల్లెపు ప్రణీత్ ఓటర్లను చైతన్యవంతులను చేయడానికి తన ఇంటి గోడకు 'నా ఓటు, మా ఇంట్లో వాళ్ల ఓట్లు అమ్మకానికి లేవు. దయచేసి మా ఓట్లు కొనడానికి రావొద్దు' అని పోస్టర్ అంటించారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 90/-
బ్రాయిలర్ చికెన్ రేటు - 170/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 200/-
Cell: 9989299661

సహృదయ వృద్ధ ఆశ్రమం
A/c & Non A/c
హైద్రాబాద్ - వరంగల్
విశ్రాంతి ఉద్యోగులు, వృద్ధులు, పేషంట్లకు విశాలమైన భవనం, ప్రశాంత వాతావరణం
24 గం॥ ఆయా, నర్సు, డాక్టర్ సేవలు కలవు
నోట్: ఆయాలు (స్త్రీ/పు) కావలెను
9701046223

రాజయ్య ఆశీర్వాదం తీసుకుని..

- నామినేషన్ వేసిన స్వతంత్ర అభ్యర్థి



ఎమ్మెల్యే రాజయ్యతో రాజేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రారంభమవ్వగా.. మొదటి రోజున ధర్మసాగర్ మండలం తాటికాయలకు చెందిన బొల్లెపాక రాజేశ్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా.. నామినేషన్ వేసేందుకు ముందు తన రాజకీయ గురువైన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను హనుమకొండలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఘన్‌పూర్ ఆర్‌ఓ కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

ప్రత్యేక కార్పొరేషన్ కావాలి

- ఉపాధి లేకనే ఆటోరంగం వైపు మళ్లాం
- జిల్లా కేంద్రాల్లో ఆటో భవన్‌ల నిర్మాణాలు చేపట్టాలి
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో ఆటోడ్రైవర్లు

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

మహబూబాబాద్: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకనే యువకులు ఆటో రంగం వైపు వస్తున్నారని ఆటోడ్రైవర్లు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.1,000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని జిల్లా కేంద్రాల్లో ఆటో భవన్లు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, 50 ఏళ్లు నిండిన ఆటో డ్రైవర్లకు నెలకు రూ.5 వేల పింఛన్, వడ్డీ లేని రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మానుకోటలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ డిమాండ్లను రాబోయే ప్రభుత్వం ముందుంచారు. తమ ఆకాంక్షలు నెరవేర్చాలని ఆటో డ్రైవర్లు కోరారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి.. ఆటో రంగంపై ఒత్తిడి తగ్గించాలని సూచించారు.



సాక్షి నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

ఆటో భవన్ ఏర్పాటు చేయాలి



ప్రతీ జిల్లా కేంద్రంలో ఆటో భవన్ నిర్మాణం చేపట్టాలి. డ్రైవర్లు కలుసుకునేందుకు, సమస్యల పరిష్కారానికి భవనం చక్కని వేదికవుతుంది. అన్ని కులాలకు కుల సంఘాల భవనాలు మంజూరు చేసినట్లే, రాబోయే ప్రభుత్వ ఆటో భవన్లు ఏర్పాటు చేయాలి.
- జి.హరీశ్

ప్రమాద బీమా కల్పించాలి



ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమాతో పాటు జీవిత బీమా కల్పించాలి. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్మోహన్ రెడ్డి ఆటో డ్రైవర్లను అన్ని విధాలా ఆదుకుంటున్నారు. అదే తరహాలో తెలంగాణలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పాటుపడాలి. ఆటోలు నడిపితే నడుము నొప్పి, మెడనొప్పి వస్తోంది. హెల్త్ కార్డులివ్వాలి. - ఎ.శ్రావణ్

ప్రభుత్వమే వడ్డీ లేని రుణాలివ్వాలి



ఫైనాన్స్‌లో ఆటోలు తీసుకోవడం వల్ల సంపాదించిన డబ్బులన్నీ ఫైనాన్స్ చెల్లించడానికే పోతున్నాయి. ఆటోల కొనుగోలుకు ప్రభుత్వమే వడ్డీ లేని రుణాలివ్వాలి. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వాలు పాటుపడాలి. పెరిగిన డీజిల్ ధరలకు అనుగుణంగా ఆదాయం రాక డ్రైవర్లు అప్పుల పాలవుతున్నారు.
- నవీన్, ఆటోడ్రైవర్, మానుకోట

పిల్లలకు ఉచిత విద్యనందించాలి



వచ్చే ఆదాయం ఆటో ఫైనాన్స్‌కే పోతుంది. ఆటోడ్రైవర్ల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి. అలాగే ఉద్యోగ అవకాశాల్లో పదిశాతం రిజర్వేషన్ కల్పించాలి.
- జి.సోమేశ్

ఇన్సూరెన్స్‌లో రాయితీ కల్పించాలి



ఆటో ఇన్సూరెన్స్‌లో 50 శాతం రాయితీ కల్పించాలి. దీంతో డ్రైవర్లు అందరూ ఇన్సూరెన్స్ చెల్లించడంతో పాటు డ్రైవర్ల కుటుంబాలకు, ప్రయాణికులకు భరోసా ఉంటుంది. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించి, ఆటో వ్యవస్థపై ఒత్తిడి తగ్గించాలి.
- బి.ప్రమోద్

ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటోడ్రైవర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. ఆర్టీఏ చట్టం సవరణ వల్ల ఆటో ట్యాక్సీలు పెరిగాయి. వాటిని తగ్గించాలి. ఉపాధి లేక యువత ఆటో రంగాన్ని ఎంచుకుంటోంది. దీంతో ఆటోల సంఖ్య పెరిగి ఉపాధి కష్టంగా మారుతోంది. అన్ని కోణాల్లో ప్రభుత్వాలు ఆలోచించి మమ్మల్ని ఆదుకోవాలి. - వెంకటేశ్

ఆలోచించి ఓటు వేయాలి



ఆటో డ్రైవర్లతో పాటు ప్రజలు అన్ని విధాలా ఆలోచించి ఓటు వేయాలి. ఓటేసిన తర్వాత ఐదేళ్లు వారిని భరించాలి. కాగా.. ప్రజల కష్టసుఖాలు తెలిసిన పార్టీకి ఓటు వేయాలి. పలు పార్టీల మేనిఫెస్టోలు ఆచరణ సాధ్యం అవుతాయా లేదా అనే కోణాల్లో ఆలోచించి ఓటు వేయాలి.
- చంద్రశేఖర్, ఆటోడ్రైవర్

నేడు మేడిగడ్డకు బీజేపీ టీం



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీని పరిశీలించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ముఖ్య నాయకులు డాక్టర్ కె.లక్ష్మణ్ శనివారం ఉదయం రానున్నారు. కాగా.. అక్టోబర్ 21న మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 20వ పియర్‌తో పాటు వంతెన కుంగిన విషయం తెలిసిందే. ఆ కుంగిన బ్యారేజీ, వంతెన ప్రాంతాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి బయల్దేరి నేరుగా 11.05 గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన హెలిప్యాడ్‌లో దిగనున్నారు. అరగంటపాటు బ్యారేజీని పరిశీలించి తిరిగి వెళ్లనున్నారు.

ఎన్నికల్లో పోటీకి గ్రీన్‌ఫీల్డ్ భూనిర్వాసిత రైతులు సిద్ధం



నామినేషన్ ఫారాలతో గ్రీన్‌ఫీల్డ్ భూనిర్వాసిత రైతులు

పరకాల: తమ భూముల సమస్యను పట్టించుకునే నాయకులు, అధికారులు కరువు కావడంతో 100 మంది పరకాల సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసిత రైతులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు శుక్రవారం పరకాల ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో 30 మంది రైతులు నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. మరో 70 మంది నామినేషన్ పత్రాలు తీసుకొని మూకుమ్మడిగా ఒకే రోజు నామినేషన్‌లు వేసి తమ సత్తా ఏంటో చూపిస్తామని రైతులు బి.రాంచందర్‌రావు, సమ్మిరెడ్డి, రవీందర్‌రావు, లక్కం వేణు, బొజ్జం రఘుపతి తెలిపారు.

కుల ధ్రువీకరణ పత్రానికి ఎమ్మెల్యే రాజయ్య దరఖాస్తు

- జిల్లాలో హాట్ టాపిక్

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కుల ధ్రువీకరణ పత్రం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎస్సీ రిజర్వ్‌డ్ ఘన్‌పూర్ నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పోటీపడగా.. చివరకు కడియంకు టికెట్ దక్కిన విషయం తెలిసిందే. రాజయ్యను బుజ్జగించేందుకు పార్టీ అధిష్టానం ఆయనకు రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్ష పదవి అందించింది. మొదటి నుంచి కడియం, రాజయ్య రాజకీయపరంగా బద్ధశత్రువులనేది వాస్తవం. ప్రస్తుత సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే రాజయ్య జనగామలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా క్షేత్ర స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. రాజయ్య తరఫున స్థానిక తహసీల్ కార్యాయంలో లేటెస్టు కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడం, ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయాలంటే లేటెస్టు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కావడంతో రాజయ్య దరఖాస్తు చేసుకున్నారన్న ప్రచారం సాగుతోంది. ఆయన నామినేషన్ వేయనున్నారా? లేకపోతే కులం సర్టిఫికెట్ కోసం ఎందుకు దరఖాస్తు చేసుకున్నారనే విషయం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించగా తమకు ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నుంచి దరఖాస్తు వచ్చింది వాస్తవమేనని తెలిపారు.

నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్ల వివరాలు (తేదీ : 03-11-2023 వరకు)

నియోజకవర్గం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు
వరంగల్ తూర్పు	-	-	01	01
వరంగల్ పశ్చిమ	-	-	-	-
జనగామ	-	-	-	-
పాలకుర్తి	-	-	-	01
స్టేషన్‌ఘన్‌పూర్	-	-	-	01
జేఎస్.భూపాలపల్లి	-	01	01	-
ములుగు	-	-	-	-
నర్సంపేట	-	-	-	02
వర్ధన్నపేట	-	-	-	-
పరకాల	-	-	-	01
మహబూబాబాద్	-	-	-	01
డోర్నకల్	-	-	-	-

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్ర: 9848211153, 9490786468. [H-788343]

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9010592111 [H-193275]

WANTED

■ యువరాజ్ కిరాణంలో పనిచేయుటకు కిరాణంలో 3 సం॥ చేసిన అనుభవం గల యువతీ, యువకుడు కా॥. ఆకర్షణీయమైన జీతం. వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సం॥ అండర్ బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490138696. [W-1220936]

■ Delicious Chicken Outlets is looking for Collections Lead in Warangal. Experience in Collections is mandatory. Salary 14-16K. Cont: 8106112401. [W-1220933]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073 [H-189349]

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ అ.కా.ను. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్నవారు వెంటనే డీటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

■ రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036. [B-1206468]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

లైఫ్@360

ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుల్లో సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!



గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధ పడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి.



మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటువ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.

● **తగినంత నిద్ర**
నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● **ఫ్లూ టీకాలు**
ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● **పరిశుభ్రతను పాటించడం**
ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● **తగినంత దూరం పాటించడం**
తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్ళలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్ళను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్దార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ' సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పెట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్ట్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణు గోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.